# ఎదురు చూసిన రాత్రి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సునీల్, గుంటూరునుంచి వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కోసం ఎదురుచూస్తున్నాడు రాత్రి ఏడుంపావుకి. కొన్ని నిముషాలలో బండి ప్లాటుఫారం మీదికి వస్తుందని ఎనౌన్సర్ చెప్పాడు.

సునీల్ అనేకసార్లు అనేక స్టేషన్‌లకి వెళ్ళి చాలామందిని రిసీవ్ చేసుకున్నాడు. కాని ఈసారిమాత్రం ఎన్నడూ లేని, ఇక ముందెన్నడూ రాని ప్రత్యేకత వుంది. అందుకే సంతోషంగా వున్నాడు.

సునీల్ భార్య వస్తోంది గుంటూరునుంచి.

సునీల్‌కి వివాహం అయి ఎనిమిది నెలలయింది. ఆఖరిసారి తన భార్యని చూచి మూడునెలలు దాటింది. కాపరానికి తొలిసారిగా వస్తోంది. ఇక జీవితాంతం తనతో గడపటానికీ, తన జీవితంలో, జీతంలో పాలు పంచుకోడానికి వస్తోంది.

అదికూడాకాదు ఆ రోజు ప్రత్యేకత.

సునీల్ వివాహం అయాక కార్యం చేసుకోలేదు. అలాంటి ఆర్భాటాలేమీ తనకి అంతగా నచ్చవని, వద్దనీ వారించాడు. తండ్రి విజయవాడ నుంచి రెండుసార్లు వ్రాసిన. మంచిరోజు చూసి కాపరానికి పంపించమని వ్రాసాడు. సునీల్ బావమరిది హైదరాబాదులోనే పని చేస్తున్నాడు. అతను గుంటూరు వెళ్ళాడు చెల్లెల్ని కాపరానికి తీసుకురావడానికి.

క్రితంరోజూ పదిరోజుల సెలవు మంజూరుచేస్తూ అన్నాడు సునీల్ ఆఫీస్ మేనేజర్. "ఆఫీసు గురించి, పని గురించి ఈ పదిరోజులు మర్చిపోండి. మళ్ళా సంవత్సరం ఈపాటికి కొడుకు బారసాలకి సెలవు అప్లికేషన్ ఇవ్వాలి తెలుసా ?"

ఆఫీసర్ మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు సునీల్.

గుంటూరు రెండుమూడుసార్లు వెళ్ళాడతను పెళ్ళయాక ఉగాదికి, శ్రీరామనవమికి. తనని ఏకాకిగా పడుకోబెట్టారు. కాఫీ తీసుకవచ్చినప్పుడు మాత్రం అయిదారుసార్లు ముద్దుపెట్టుకున్నాడంతే.

ఈ రాత్రే తనకు ప్రథమ రాత్రి. ఒకరి చేతుల్లో మరొకరు కరిగే రాత్రి ఈ రాత్రే. ఇంతకాలం, యవ్వనం ప్రవేశించిన క్షణంనుంచి ఇంత దాకా ఆత్రంగా, ఆనందంగా ఎదురుచూస్తున్న రాత్రి ఇదే.

మరోసారి నవ్వుకున్నాడు సునీల్. అన్ని ఏర్పాట్లు తనే చేసుకున్నా డీరాత్రి. ఆ గది చూస్తే ఏమంటుంది ? సిగ్గుపడుతుందా ? నవ్వుకుంటుందా ? సంతోషపడుతుందా ?

తన బావమరిది తమతో ఇంటికి రాకుండా వెళ్ళిపోతే బావుండును. తెలివయినవాడయితే రాడు. డీజల్ ఇంజన్‌ని దూరంనుంచే చూసాడు సునీల్. గుండెల్లో రైళ్ళు పరిగెత్తినట్లుగా వుంది. సంతోష ఒరవడికి.

తను మిస్ కాకూడదు వాళ్ళని. కళ్ళముందు పరిగెడుతున్న రైల్వే కంపార్ట్‌మెంట్‌ల వంక. వాటితో కిటికీలముందు కూర్చుని చూస్తున్న వాళ్ళవంక పరికించి చూసాడు సునీల్. ఏడో నంబర్ కంపార్ట్‌మెంట్ తలుపు దగ్గర నిలబడి చెయ్యి వూపాడు సునీల్ బావమరిది. సునీల్ కళ్ళు తన భార్యకోసం వెదుకుతుండగానే ఆ కంపార్ట్‌మెంట్ కళ్ళముందునుంచి దాటిపోయింది.

సునీల్ ఆగివున్న కంపార్ట్‌మెంట్ దగ్గరికి వెళ్ళేసరికి సామాను వెనక నడుస్తున్నారు అన్నా, చెల్లెళ్ళిద్దరూ. సిగ్గుగా, ఓరగా, నవ్వుతూ

చూడచ్చొ చూడకూడదా అన్నట్లుగా, చూడాలా, వద్దా అన్నట్లుగా చూసింది సునీల్ భార్య సునీల్ వంక.

ప్లాటుఫారందాటి బయటికి వచ్చాక సునీల్ బావమరిది ఆటోలో సామాను పెట్టించి, తనే మాట్లాడాడు. ఆటోని సునీల్ ఇంటికి.

సునీల్ చేతిలో అయిదు రూపాయల కాగితం వుంచి అన్నాడు.

"రేపు మధ్యాహ్నం వస్తాను వీలుంటే, జాగ్రత్తగా వెళ్ళండి. రేపొస్తానమ్మాయ్"

సునీల్ మనసులోనే కృతజ్ఞత తెల్పుకొన్నాడు తన బావమరిదికి. ఆటో కదిలాక అన్నాడు.

"మీ అన్న ఫర్వాలేదే మనవెంట వస్తాడనుకొన్నాను."

అందంగా నవ్వింది సునీల్ భార్య లేదా సునీల్‌కి అలా అనిపించింది.

"పదిరోజులు సెలవు పెట్టాను"

"..........."

"రారేమోనని భయపడ్డాను, ఎప్పుడు ఎవర్ని రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కి వచ్చినా, వాళ్ళు రారేమోనని భయం వుంటూంటుంది నాకు ఇవాళ ఇంకా ఎక్కువ భయపడ్డాను."

"..........."

"చాలా సామాను తెచ్చావే? సారెగట్రా చేరి చాలా మూటలు అయ్యాయి.

"మనింటికి ఇంకా ఎంతదూరం? అడిగింది.

ఆటో డ్రయివర్‌కి అయిదు రూపాయలు ఇచ్చి సామానంతా ఇంట్లోకి చేర్చాడు సునీల్. మూడు గదులు, వంటగది కాకుండా. 'ఆ గది' తలుపులు ముందరేవేసి బయట గొళ్ళెం పెట్టాడు. ముందరే ఆ గది చూపించడం ఇష్టంలేదు సునీల్‌కి.

"వంట చేశాను. ప్రయాణంచేసి అలసిపోయి వస్తావని చేసివుంచాను ఇవాళ చేశానని రోజూ చేయమంటే మాత్రం వూరుకునేది లేదమ్మాయ్".

సునీల్ భార్య చిన్నగా నవ్వింది. స్నానం చేయడానికి స్నానాల గదిలోకి వెళ్ళింది.

అప్పుడు గుర్తుకు వచ్చింది సునీల్‌కి, అగ్గిపెట్టె కొనాలనుకున్న సంగతి మర్చిపోయాడవి సునీల్ భార్యని అడిగాడు డ్రస్ చేసుకోగానే.

"అలా సరదాగా మెయిన్ రోడ్‌దాకా వెళ్ళొద్దామా ? అయిదు నిమి షాల్లో తిరిగి వచ్చేద్దాం. రాగానే అన్నం తినచ్చు."

"మీ యిష్టం."

అంతదాకా సునీల్ తన భార్యని దగ్గరకు తీసుకోలేదు, విసుగ్గా వుంటుందని. నడుంచుట్టూ చేతులువేసి, మీదకి లాక్కున్నాడు మృదువుగా.

"బొట్టు పాడవుతుంది" వారించింది సునీల్‌ని.

ఇల్లు తాళం వేసి బయటికి వచ్చారిద్దరు. నడుస్తూంటే అన్నది సునీల్ భార్య.

"పాలు పొంగించకుండా వంట చేసారే ?"

"నాకు తెలియదు. మర్చాను."

"ఫర్వాలేదులెండి రేపు పాలతో గిన్నెలు కడిగి చేసుకుందాం."

కిళ్ళీషాప్ ముందు ఆగాడు సునీల్. అగ్గిపెట్టె కొన్నాడు. వెనక్కి తిరుగుతుంటే తమలపాకులు కొనలేదని గుర్తొచ్చింది. కిళ్ళీషాపతను కడుతున్న కిళ్ళీని చూసాక.

రెండు కిళ్ళీలు కట్టమని చెప్పాడు తమలపాకులు లేకుండా మొదటి రాత్రి ఏం రాత్రి ? ఇంకా నయం గుర్తొచ్చింది.

కిళ్ళీలు అందుకొంటూండగా చెవులు చిల్లులుపడేలా లారీ హారన్, కీచుమంటున్న లారీ చక్రాల చప్పుడు, ఎవరివో బాధాకరమయిన అరుపులు వినబడ్డాయి సునీల్‌కి.

గుండె ఝల్లుమంటూంటే వెనక్కి తిరిగి చూసాడు. కళ్ళు తిరిగినట్లయ్యాయి. ఎదురుగా లారీ, కంగారుగా లారీని డ్రయివరు వెనక్కి పోనిస్తున్నాడు. రోడ్డుకి అడ్డంగా, లారీచక్రాల క్రింద పడి నలిగిన ఇద్దరు సైకిలిస్టులు ఒకతని తల పగిలి, మెదడులోంచి కారుతోంది రక్తం నేలమీదకి ఎర్రగా, చిక్కగా. అతనికి అక్కడికక్కడే ప్రాణం పోయినట్లుంది.

ఇంకొకతను రోడ్డుమీద దొర్లుతూ అరుస్తున్నాడు బాధగా. "ఓ గాడ్! జీసస్!! గాడ్!!."

అతని మోకాలు విరిగి రక్తం కారుతోంది.

"వద్దు, పద."

కళ్ళప్పగించి, అచేతనురాలయి నిలబడిపోయి చూస్తున్న తన భార్య చేతిని పట్టుకొని, రిక్షావైపు లాక్కెళ్ళాడు సునీల్ గాభరాగా. ఆ దృశ్యం మగాడయిన తనే భరించలేనిదిగా వుంది సునీల్‌కి.

రిక్షా యింటికి చేరేదాక, దాదాపు రెండు నిముషాలసేపు సునీల్ తన భార్యతో ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయాడు. ఆ రక్తం, ఆ జాలిగొలిపే దృశ్యం సునీల్ మనసుని చెదిరేలా చేసింది.

రిక్షావాడికి రూపాయినోటు అందించి తలుపు తాళం తీసాడు. మౌనంగా లోపలికి నడిచింది సునీల్ భార్య. మధ్య గదిలో కుర్చీలో కూలబడిపోయింది, శక్తి అంతా కోల్పోయినదానిలా.

సునీల్‌కి దాదాపు అయిదు నిమిషాలు ఏం చేయాలో తోచలేదు. ఎదురుగా కనబడ్డ రేడియోని ఆన్ చేసి తెలుగు పాటలు పెట్టాడు. అర గంటదాకా ఇద్దరూ తెలుగు పాటలు వింటూండిపోయారు. ఒకరితో మరొకరు మాట్లాడకుండా.

పాటలు అయిపోయాయి తొమ్మిదింపావుకి. మరో అయిదు నిముషాలాగి "అన్నం తిందామా?" అడిగాడు సునీల్ భార్యని.

"నాకాకలిగా లేదు" అన్నది సునీల్ భార్య. ఆ మాటల్లో బాధ

"ఛ, ఎందుకలా అయిపోయావ్ ?" లాలనగా తల నిమురుతూ అన్నాడు లేచాడు.

"ఆ గది" గొళ్ళెం తెరచి, లోపల నిలబడి చూశాడు. గది మధ్యలో మంచం. మంచం మీద తెల్లటి దుప్పటి. గులాబి రేకులు. మల్లెపూవులు ఆ దుప్పటినిండా. స్టాండ్‌కి అగరత్తులు నిండుగా. స్టాండ్ ప్రక్కన పళ్ళెంలో డజను కొవ్వొత్తులు వెలిగించడానికి సిద్ధంగా వున్నాయి, కిటికీ కర్టెన్స్ మూసివున్నాయి. మంచం ప్రక్కన ఫ్లాస్కులో పాలు. పళ్ళెం నిండా స్వీట్స్.

అగరత్తులు, క్రొవ్వొత్తులు అగ్గిపెట్టెతో వెలిగించి, గది తలుపుమూసి, భార్యని ఆ గదిలోకి తీసుకువెళితే కొంతదాకా తేరుకుంటుం దనుకున్నాడు, గుమ్మం దగ్గరే ఆగిపోయాడు మధ్య గదిలో తన బెడ్డింగ్ పరుచుకుని పడుకొని వుంది సునీల్ భార్య.

బాగా సెన్సిటివ్ అనుకున్నాడు ఈజీచైర్‌లో పడుకుంటూ.

ఈజీచైర్‌లో పడుకున్న సునీల్‌కి అర్ధరాత్రి మెలకువ వచ్చింది గోడ గడియారం పన్నెండుసార్లు మ్రోగుతూంటే ఉలిక్కిపడి లేచాడు. పడుకున్న తన భార్యవైపు చూసాడు.

"వద్దు అతని మీదకు పోనివ్వద్దు కాళ్ళు లేకపోతే బ్రతకలేడు" నిద్రలో కలవరిస్తూ, నెమ్మదిగా వెక్కి వెక్కి ఏడుస్తోంది సునీల్ భార్య.

లేచి వెళ్ళి, "పిచ్చి" అంటూ నుదుటిమీద ముంగురులను సవరించి భార్య బుగ్గల మీద ముద్దు పెట్టుకున్నాడు సునీల్ మృదువుగా. మర్నాడు సినిమా హాల్లో, చిల్లర కోసం జేబులు వెదుకుతూంటే చేతికి మెత్తగా ఏవో తగిలాయి సునీల్‌కి. బయటకి తీసిచూసి, తన భార్య కళ్ళ బడకుండా ఆ రెంటినీ డస్ట్‌బిన్‌లో పారేసాడు.

ఆ రెండూ క్రితం రాత్రి కొన్న కిళ్ళీలు.

ఆ సంఘటన, తన భార్యలో మానవత్వం, జాలి ఉన్నాయన్న సంగతిని రుజువు చేసింది. సునీల్ ఎదురుచూసిన రాత్రి వృథా అయినందుకు విచారించలేదు. తన భార్యలోని మానవతకి స్పందనకి ఆనందించాడు.

(రంజని 1974)